# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 12-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 250 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## మే 15న తెరుచుకోనున్న బద్రీనాథ్ ఆలయ ద్వారాలు

డెహ్రాడూన్, మే 11: ఉత్తరాఖండ్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రం అయిన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు మే 15న (శుక్రవారం) తెరుచుకోనున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున 4.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఆలయ ప్రధాన అర్చకుడు సహా 27 మంది మాత్రమే హాజరుకానున్నారు. భక్తులకు అనుమతి లేదు. కరోనా మహమ్మారి విస్తరణ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లాక్‌డౌన్ నిబంధనల మేరకు ఉత్తరాఖండ్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ 29న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలను తెరిచారు. అప్పుడు కూడా ఆలయ ప్రధాన అర్చకుడు సహా 16 మందికి అనుమతి ఇచ్చారు. కాగా, చార్‌ధామ్ ప్రాంతం మంచు కొండల నడుమ ఉండటంతో ఏటా శీతాకాలంలో ఆరు నెలలపాటు ఆలయ ద్వారాలను మూసివేసి వేసవిలో తిరిగి తెరువడం ఆనవాయితీగా వస్తున్నది. ఆ ఆనవాయితీనే ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు.

# దేశంలో ఆగని కరోనా ఉధృతి

## పాజిటివ్ కేసుల సంఖ్య 67,152కి చేరిక

## ఇప్పటివరకు 2206 మంది మృతి

న్యూఢిల్లీ,మే11(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతూనే ఉంది. పాజిటివ్ కేసులు, మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. ఇప్పటివరకు 67152 కేసులు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 67,152కి పెరిగింది. గత 24 గంటల్లో కొత్తగా 4,200 కరోనా కేసులు నమోదవగా, 97 మంది మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఈ ప్రాణాంతక వైరస్ వల్ల దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 2206 మంది మృతిచెందారు. ఈ వైరస్ బారిన పడిన 20,916 మంది కోలుకోగా, 44,029 కేసులు యాక్టివ్‌గా ఉన్నట్లు ఈ మేరకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సోమవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దేశంలో అత్యధిక కేసులు నమోదవుతున్న మహారాష్ట్రలో మొత్తం కరోనా బాధితుల సంఖ్య 22171కి చేరింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 832 మంది మరణించారు. గుజరాత్‌లో మొత్తం 8194 కరోనా కేసులు నమోదవగా, ఈ వైరస్ వల్ల 493 మంది మృతిచెందారు. తమిళనాడులో కరోనా కేసుల సంఖ్య 7204కు చేరింది. అదేవిధంగా ఢిల్లీలో 6923కు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లో ఇప్పటివరకు 3614 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా, 215 మంది మృతిచెందారు. ఇక మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, యూపీలలో కరోనా వైరస్ విలయ తాండవం చేస్తోంది.తాజా సమాచారం ప్రకారం ఏపీ–1980, అండమాన్ నికోబార్ ఐలాండ్స్ – 33, అరుణాచల్ ప్రదేశ్ – 1, అస్సాం – 63, బీహార్ – 696, ఛండీగర్–169, ఛత్తీస్‌ఘడ్–59, దాదర్ నగర్ హవేలీ– 1, ఢిల్లీ–6923, గోవా–7, గుజరాత్–8194, హర్యానా–703, హిమాచల్‌ప్రదేశ్–55, జమ్ముకశ్మీర్–861, జార్ఖండ్ – 157, కర్ణాటక– 848, కేరళ–512, లడాక్–42, మధ్యప్రదేశ్–3614, మహారాష్ట్ర–22171, మణిపూర్–2, మిజోరం– 1, మేఘాలయా– 13, నాగాలాండ్– 0, ఒడిశా – 377, పుదుచ్చేరి –9, పంజాబ్–1823, రాజస్థాన్–3814, తమిళనాడు–7204, తెలంగాణ–1196, త్రిపుర – 150, ఉత్తరాఖండ్ – 68, యూపీ–3467, పశ్చిమ బెంగాల్–1939 కేసులు ఉన్నాయి. అటు కరోనా మరణాలు అత్యధికంగా మహారాష్ట్ర(832)లో సంభవించగా.. ఆ తర్వాత గుజరాత్(493), మధ్యప్రదేశ్(215), వెస్ట్ బెంగాల్(185), రాజస్తాన్(107)రాష్ట్రాలు ఉన్నాయి. దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వైరస్ కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా.. నియంత్రణ మాత్రం సాధ్యం కావడంలేదు. దేశ వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 4,213 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 97 మంది మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తాజా కేసులతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 67,152కి, మృతుల సంఖ్య 2206కి చేరింది. అలాగే ఇప్పటివరకు 20,917 మంది వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు.

వైరస్ వ్యాప్తి ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, తమిళనాడు రాష్ట్రాల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది. అత్యధిక కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్న మహారాష్ట్రలో మొత్తం కరోనా బాధితుల సంఖ్య 22171కి చేరింది. వైరస్ కారణంగా 832 మంది మరణించారు. గుజరాత్‌లో మొత్తం 8194 కరోనా కేసులు నమోదవగా, 493 మంది మృతిచెందారు. తమిళనాడులో కరోనా కేసుల సంఖ్య 7200కు చెరింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 6923కు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లో ఇప్పటివరకు 3614 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా, 214 మంది మృతిచెందారు. మరోవైపు కోవిడ్ కేసుల తీవ్రత దృష్ట్యా ప్రస్తుతం రెడ్ జోన్లుగా ఉన్న వాటిని ఆరెంజ్, గ్రీన్ జోన్లుగా మార్పుచెందేలా చూడటం, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

# ఎక్కువ పని దినాలు కల్పించాలి : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్,మే 11: వీలయినంత కల్పించాలని, కొత్తగా వస్తున్న కూలీలకు ఎక్కువ మంది కూలీలకు ఉపాధి జాబ్ కార్డులు జారీ చేయాలని, అధికారులను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు.

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు, కూలీలకు ఉపాధి కల్పన, కరోనా, వేసవి నేపథ్యంలో కూలీల భద్రత, నర్సరీలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, వైకుంఠ ధామాలు తదితర అంశాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సగటున ప్రతి గ్రామ పంచాయతీ నుంచి 182 మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. అలాగే పల్లె ప్రగతి, నర్సరీల్లో మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు వైకుంఠ ధామాల నిర్మాణ పనులను పురోగతిపై సమీక్షించారు.

## ఢిల్లీలో నెల రోజుల్లోనే 6 వేల కరోనా కేసులు నమోదు

న్యూఢిల్లీ మే11: దేశ రాజధాని ఢిల్లీని కరోనా వైరస్ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండటంతో ఢిల్లీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఢిల్లీలో కేవలం 1000 పాజిటివ్ కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. సరిగ్గా నెల రోజుల కాలంలో ఆ కేసుల సంఖ్య 7 వేలకు పైగా చేరింది. గత పది రోజుల నుంచే పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆదివారం ఒక్కరోజే ఢిల్లీలో 310 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 63 మంది కరోనా బాధితులు ఈ వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. కరోనా కేసుల్లో మూడో స్థానంలో నిలిచిన ఢిల్లీలో ఇప్పటి వరకు 7,233 పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ వైరస్ నుంచి కోలుకుని 2,129 మంది డిశ్చార్జి కాగా, 73 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఢిల్లీలో సడలింపులు ఇచ్చిన తర్వాతే కరోనా కేసుల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గత వారం సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఢిల్లీలో లాక్‌డౌన్ ఎత్తివేసేందుకు సమయం ఆసన్నమైందని చెప్పిన విషయం విదితమే. ఇక నిన్న మీడియాతో మాట్లాడిన కేజ్రీవాల్.. ఢిల్లీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, బాధితులు కూడా కోలుకుని ఇళ్లకు తిరిగి వెళ్తున్నారని తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ రాజ ఘైడి వదనమున
నా జన్మను ప్రేమ వెలుగ... ప్రతిభా ద్యుతిగా
నీ ఘనమున వందనములచే
పూజలగాను జిడ్డు కృష్ణ మూర్తిని దలచుదే!!

(మే 12 జిడ్డు కృష్ణమూర్తి జననం)

–రాధశ్రీ

సెల్: 9494481210



## సైంటిస్టులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,మే11(ఆర్‌ఎన్‌ఎ): నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా దేశంలోని సైంటిస్టులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. తమ ఆవిష్కరణలతో సగటు పౌరుడి జీవితంలో మార్పులు తెచ్చిన ప్రతి శాస్త్రవేత్తకు ధన్యవాదాలు తెలిపారు. 1998లో భారత శాస్త్రవేత్తలు సాధించింది దేశ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందంటూ పోఖ్రాన్ పరీక్షలను పరోక్షంగా ప్రస్తావించారు. అటు కరోనాను ఓడించడానికి కొత్త ఆవిష్కరణలకై ప్రయత్నిస్తున్న వారందరికీ సెల్యూట్ చేస్తున్నాను అన్నారు.

## రైల్వే సర్వీసుల పునరుద్ధరణ నిర్ణయం మంచిదే: చిదంబరం

న్యూఢిల్లీ,మే11(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో రైల్వే సర్వీసులను పునరుద్ధరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగదిస్తుందని మాజీ ఆర్థిక మంత్రి, సీనియర్ నేత పీ చిదంబరం అన్నారు. అదేవిధంగా రోడ్డు రవాణా, విమానాలను కూడా ప్రారంభించాలని ఆయన సూచించారు. ప్రయాణికులు, వస్తువుల తరలింపు కోసం రోడు రవాణా, రైల్వే, విమాన సర్వీసులను ప్రారంభించినప్పుడే ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు పుంజుకుంటాయని ఆయన చెప్పారు. ఈ నెల 12 నుంచి వివిధ రాష్ట్రాల రాజధానులకు, ఢిల్లీకి మధ్య తిరిగే 15 మార్గాల్లో రైలు సర్వీసులను పునరుద్ధరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీటికి సంబంధించిన ఆన్‌లైన్ బుకింగ్స్‌ను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించింది.

## మండలి అభ్యర్థిగా ఉద్దవ్ నామినేషన్

### ఏకగ్రీవం కానున్న ఎన్నిక

ముంబై,మే11(ఆర్‌ఎన్‌ఎ): మహారాష్ట్ర శాసన మండలి అభ్యర్థిగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం తన భార్య, కుమారుడితో కలిసి వెళ్లి రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి గత ఏడాది నవంబర్ 29న ఉద్ధవ్ థాక్రే మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఆయనకు ఏ చట్టసభలోనూ సభ్యత్వం లేనందున మే 29 లోపు ఏదో ఒక సభకు ఎన్నిక కాకపోతే పదవి నుంచి దిగిపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 24న మహారాష్ట్ర శాసనమండలిలో 9 స్థానాలు ఖాళీ అయ్యాయి. ఎమ్మెల్యే కోటాలో ఎన్నికునే ఈ తొమ్మిది స్థానాల్లో ఒక స్థానం కోసం ఉద్ధవ్ నామినేషన్ దాఖలు చేశారు. మే 21న ఎన్నికలు జరుగనున్నాయి. మహారాష్ట్ర శాసనసభలో బీజేపీకి 105 మంది సభ్యుల బలం ఉన్నది. శివసేనకు 56, ఎన్సీపీ 54, కాంగ్రెస్‌కు 44 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలంటే ఒక్కో అభ్యర్థికి 29 తొలి ప్రాధాన్య ఓట్లు కావాలి. ఈ లెక్క ప్రకారం బీజేపీ మూడు స్థానాలను, అధికార కూటమి 5 స్థానాలను స్వతహాగా గెలుచుకునే అవకాశం ఉన్నది. మరో స్థానానికి పోటీ ఉన్నది. ఈ నేపథ్యంలో కూటమి తరపున ఐదుగురు అభ్యర్థులనే నిలబెట్టినందున ఉద్ధవ్ గెలుపు దాదాపు ఖాయమైంది

# బ్రిటన్‌లో లాక్‌డౌన్ జూన్ 1 వరకు పొడిగింపు

### జాతిని ఉద్దేశించి వెల్లడించిన ప్రధాని బోరిస్ జాన్సన్

### జులై 1 నుంచి బహిరంగ ప్రదేశాల్లో ఆంక్షల తొలగింపు

లండన్,మే11(ఆర్‌ఎన్‌ఎ): కరోనా మహమ్మారి అగ్రరాజ్యాల్లో విలయతాండవం చేసున్నది. బ్రిటన్‌లో కేసులు పెరుగుతున్న క్రమంలో లాక్‌డౌన్ పొడిగించాలని నిర్ణయించారు.

బ్రిటన్‌లో ఇటీవల కొంత నెమ్మదించిన కరోనా కేసులు మళ్లీ పుంజుకున్న నేపథ్యంలో ప్రధాని బోరిస్ జాన్సన్ లాక్‌డౌన్‌ను వచ్చే నెల ఒకటో తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ఈసందర్భంగా బోరిస్ జాన్సన్ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. లాక్‌డౌన్ ఇప్పట్లో ముగిసేలా లేదని పేర్కొన్న ఆయన జూన్ ఒకటో తేదీ వరకు లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్టు తెలిపారు. జూన్ 1 నుంచి కొన్ని ప్రాథమిక పాఠశాలలు, కొన్ని ఇతర దుకాణాలు తెరుచు కుంటాయన్నారు. అలాగే, జులై 1 నుంచి బహిరంగ ప్రదేశాల్లో ఆంక్షలను సడలించనున్నట్టు చెప్పారు. అయితే ప్రతి ఒక్కరు మాస్కులు ధరించడం తప్పనిసరి అని ప్రధాని స్పష్టం చేశారు. ఎవరికివారు జాగ్రత్తగా ఉండటం అలవాటు చేసుకోవాలని బోరిస్ పిలుపునిచ్చారు. వైరస్ ప్రభావం ఎక్కువకాలం ఉండే అవకాశం ఉందని, మహమ్మారిని అణచివేసేందుకు సరైన ఔషధం వచ్చే వరకు లాక్‌డౌన్‌ను పొడిగించడం తప్ప మరో మార్గం లేదన్నారు.

# చేనేతను ఆదుకునేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి

### కార్మికులకు చేతినిండా పనికల్పిస్తాం

### –బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభించిన కేటీఆర్



రాజన్న సిరిసిల్ల,మే11(నేటినిజం ప్రతినిధి): చేనేతకు ఢోకా లేకుండా, కార్మికులకు చేతినిండా పని కల్పించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను తీసుకుంటున్నామని పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. చేనేతకు మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని టెక్స్‌టైల్స్ పార్క్‌లో పలు అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.0

సెంట్రల్ లైటింగ్, పరిపాలన భవనం, కార్మికుల భోజశాల, కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్ వరంగల్, సిరిసిల్లలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నేతన్నలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం తరపున పెద్ద ఎత్తున ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలిపారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్ టైల్ పార్క్‌లో 14కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పార్క్‌లో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంతో పాటుగా కార్మికుల భోజనశాల, కుట్టుశిక్షణ కేంద్రాలను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. చేనేతకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నామని,ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ వారి కోసం పని చేస్తున్నారని మంత్రి తెలిపారు. రూ.14.50 కోట్ల తో టెక్స్ టైల్ పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. కరోనా నేపథ్యంలో కార్మికులకు అండగా ఉంటామన్నారు. కంపెనీల యజమానులు కార్మికుల శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. చేనేతల కార్మికులకు ప్రభుత్వ పరంగా చేయుతను అందిస్తామన్నారు. కేంద్రం సాయం కోరుతూ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి లేఖ రాసినట్లు మంత్రి తెలిపారు.సిరిసిల్ల నేత కళాకారుల నైపుణ్యం ప్రపంచానికి తెలియ జేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన తెలిపాడు. విద్యుత్ సబ్సిడీ రాలేదని.. తంగళ్లపల్లి మండలానికి చెందిన నరహరి అనే వ్యక్తి నిరసన తెలిపాడు. కార్యక్రమంలో స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నగరంలో కోరలు చాస్తున్న కరోనా

### ఇద్దరు చిన్నారులకు పాజిటివ్

### ఆందోళనలో సిటీ ప్రజలు

హైదరాబాద్,మే11(ఆర్‌ఎన్‌ఎ): రోజు రోజుకు కోరలు చాచుతున్న కరోనా భూతానికి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. హైదరాబాద్ నగరంలోని రామాంతపూర్‌లో రెండు నెలల పసికందు, నాలుగు సంవత్సరాల చిన్నారికి కరోనా వైరస్ సోకినట్లు అధికారులు వెల్లడించారు. నవరంగ్‌గూడలో కరోనా వైరస్ సోకిన వృద్ధ మహిళకు చెందిన కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఇరువురు చిన్నారులకు పాజిటివ్ అని తేలినట్లు అధికారులు ధృవీకరించారు. ప్రస్తుతం బేగంపేట్ ప్రకృతి వైద్యశాల ఐసోలేషన్ కేంద్రంలో ఉన్న ఇద్దరు చిన్నారులను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు రంగారెడ్డి అర్బన్ జిల్లా పరిధిలో కరోనా వైరస్ ఉధృతి మరింత పెరుగుతుంది. చాపకింద నీరులా విజృంభి స్తున్న ఈ మహమ్మారిని అరికట్టేందుకు జిల్లాఅధికార యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కరోనావ్యాప్తి ఆగడం లేదు. రంగారెడ్డి జిల్లాలో తాజాగా ఐదు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో సరూర్‌నగర్‌లోని జేబీకాలనీకి చెందిన డయాలసిస్ రోగి(78) మృతి చెందాడు. మృతుడి కుమారుడి నమూనాలు సేకరించగా అతనికి పాజిటివ్‌గా తేలింది. అలాగే సరూర్‌నగర్ విజయపురి కాలనీకి చెందిన ఓ కుటుంబంలో ఇప్పటికే ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ కాగా కుటుంబ సభ్యుల నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపించగా అతని ఇంట్లో నాలుగేళ్ల బాలుడికి పాజిటివ్‌గా తేలింది. వనస్థలిపురంలోని హిల్ కాలనీలోఇప్పటికే కరోనా వైరస్ సోకిన మహిళ నుంచి డ్రైవర్‌కు ఇతని భార్యకు కరోనా సోకినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్ధారించారు. మొత్తం జిల్లాలో ఇప్పటి వరకు పాజిటివ్ కేసుల సంఖ్య 99కి చేరుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 217 కేసులు నమోదయ్యాయి. వీరిలో 12 మంది మృతి చెందారు. మృతుల్లో రంగారెడ్డిలో 5, మేడ్చల్‌లో 6, వికారాబాద్‌లో ఒకరున్నారు. పాజిటివ్ కేసుల్లో రంగారెడ్డిలో 99, మేడ్చల్‌లో 80, వికారాబాద్‌లో 38 ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా కేసులు నమోదైన వనస్థలిపురంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జల్లెడ పడుతున్నారు. వంద మంది ఆరోగ్య కార్యకర్తలు జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 3,800 మంది వివరాలను సేకరించారు. ఇంట్లో కుటుంబసభ్యులు ఎంత మంది ఉన్నారు.. వారు చేసే పని, ఎక్కడికైనా వెళ్లి వచ్చారా? ఎవరైనా జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారా? వంటి వివరాలను సేకరించారు. ఇదిలావుంటే వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వలస కూలీలు తిరిగి వస్తుండటంతో రాష్ట్రంలో హైఅలర్ట్ ప్రకటించినట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతి ఒక్కరిపై దృష్టి పెట్టామన్నారు. సరిహద్దుల్లోనే వారికి శరీర ఉష్ణోగ్రత పరీక్షలు చేసి క్వారంటైన్ స్టాంపులు వేసి వారు వెళ్తున్న గ్రామాల వైద్య సిబ్బందికి సమాచారం అందిస్తున్నా మన్నారు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర నుంచి వచ్చిన వారికి పరీక్షలు చేయగా పాజిటివ్ అని తేలిందన్నారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతి ఒక్కరినీ 14 రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచుతామన్నారు. కరోనా వచ్చిన వలస కూలీల్లో 8 మంది యాదాద్రి భువనగిరి జిల్లా, ముగ్గురు మంచిర్యాల జిల్లాకు చెందినవారని ఆయన తెలిపారు.

# గాంధీలో కరోనాకు ప్లాస్మా థెరపీ

### ఐసిఎంఆర్ సూచనల మేరకు చికిత్సలు

### రంగం సిద్ధం చేసిన ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్,మే11(ఆర్‌ఎన్‌ఎ): కోవిడ్–19 ఆసుపత్రి గాంధీలో ప్లాస్మా థెరపీకి రంగం సిద్ధమయ్యింది. ఐసిఎంఆర్ సూచనల మేరకు ఇక్కడ వైద్యం అందించనున్నారు. కరోనా వైద్యం కోసమే ప్రత్యేకంగా కేటాయించిన గాంధీ ఆసుపత్రిలో కరోనా మహమ్మారికి చికిత్సలో కీలకంగా భావిస్తున్న ప్లాస్మా థెరపీని మొదలుపెట్టనున్నారు. ఇందుకోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అనుమతి పొందింది. కరోనా బారిన పడి వైద్యసేవల అనంతరం పూర్తి స్థాయిలో కోలుకున్న 35 మంది ప్లాస్మా దాతలు ముందుకురాగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న 15మంది నుంచి ప్లాస్మా కణాలను సేకరించారు. వారిలో ఆరుగురు కరోనా బాధితుల కేస్ సీట్లు ఇతర వివరాలను ఐసీఎంఆర్‌కు పంపించారు. అక్కడి నుంచి వచ్చిన సూచనల మేరకు మొదటి విడతగా ముగ్గురికి ప్లాస్మా థెరపీ చికిత్స ప్రారంభిస్తారు. ఆరోగ్యవంతుడైన కరోనా బాధితుల నుంచి 400 ఎం.ఎల్ ప్లాస్మాను సేకరించి 200 ఎం.ఎల్ ప్లాస్మాను బ్లడ్ గ్రూప్ ఆధారంగా రోగి శరీరంలోకి ఎక్కిస్తారు. ఈ ప్రక్రియకు సుమారు 2 గంటల సమయం పడుతుంది. ప్లాస్మా థెరపీతో రోగి కోలుకుంటున్నట్లు భావిస్తే మరో 200 ఎం.ఎల్ ప్లాస్మాను ఎక్కిస్తారు. ఇటు దేశవ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్లాస్మా థెరపీ చికిత్సలు, పనితీరుపై ఐసీఎంఆర్ ఎప్పటికప్పుడు ఆరా తీసి పలు సలహాలు సూచనలు అందిస్తోంది. గాంధీలో చేపట్టే ఎ÷–లాస్మా థెరపీ చికిత్సను అనుక్షణం ఐసీఎంఆర్ నిపుణులు పర్యవేక్షించనున్నారు.

## భారత్‌లో ఉగ్రదాడులకు కుట్ర!

న్యూఢిల్లీ మే 11: భారత్‌లో ఉగ్రదాడులకు లష్కరే తోయిబా ఉగ్రవాదులు కుట్ర చేస్తున్నట్లు సమాచారం. కరోనా వైరస్‌పై దేశమంతా పోరాడుతున్న విషయం విదితమే. ఈ సమయంలోనే జమ్మూకశ్మీర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాడులు చేయాలని ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంతో లష్కరే తోయిబా ఉగ్రవాదులు చేతులు కలిపినట్లు సమాచారం. ఆదివారం రోజు ఇస్లామాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో దావూద్ ఇబ్రహీంతో.. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ సహాయంతో.. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ ప్రతినిధులు సమావేశమైనట్లు తెలిసింది. ప్రస్తుతం భారత్‌లో కరోనా వైరస్‌ను తుదముట్టించే పనిలో అందరూ నిమగ్నమయ్యారు.. ఇప్పుడే దాడులు చేసేందుకు సరైన సమయని ఐఎస్ఐ భావించినట్లు సమాచారం. కశ్మీర్ వ్యాలీలో ఉగ్రవాద దాడులు చోటు చేసుకునే అవకాశం ఉందని వార్తలు వచ్చిన నేపథ్యంలో సోమవారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హంద్వారాలో ముగ్గురు జవాన్ల మృతికి తామే బాధ్యులమని టీఆర్ఎఫ్(ది రెసిస్టెన్స్ ఫ్రంట్) ఉగ్రవాద సంస్థ ప్రకటించిన విషయం విదితమే.

# చైనాలో మరోమారు పాజిటివ్ కేసుల కలకలం

## షూలన్ నగరంలో 11 కేసుల నమోదు

బీజింగ్,మే11(ఆర్‌ఎన్‌ఎ): చైనాలో మళ్లీ కరోనా పాజిటివ్ కేసుల కలవరం మొదలైంది. సోమవారం ఒక్క రోజే ఆ దేశంలో 17 కేసులు నమోదు అయ్యాయి. దీంట్లో అయిదు కేసులు వైరస్‌కు కేంద్ర బిందువైన వుహాన్ నగరంలోనే చోటుచేసుకున్నాయి. చైనాలోని ఈశాన్యంలో ఉన్న జిలిన్ ప్రావిన్సులోని షూలన్ నగరంలో కొత్తగా ఎక్కువ కేసులు నమోదు అవుతున్నాయి. దీంతో ఆ నగరాన్ని లాక్‌డౌన్ చేశారు. ఆదివారం ఒక్క రోజే ఆ నగరంలో 11 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులన్నీ ఓ దోబీ మహిళకు లింకై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దోబీ వృత్తి చేపట్టే 45 ఏళ్ల మహిళ మొదట తన భర్తకు, సోదరులకు, ఆ తర్వాత ఫ్యామిలీ సభ్యులందరికీ వైరస్‌ను అంటించింది. వాస్తవానికి ఆమెకు ఎటువంటి ట్రావెల్ హిస్టరీ లేదు. వైరస్ కేసులు బయటపడడంతో షూలన్ నగరంలో ఉన్న అన్ని పబ్లిక్ స్థలాలను మూసివేశారు. నగరవాసులందర్నీ ఇండ్లల్లోనే ఉండాలంటూ ఆదేశించారు. ప్రజా రవాణా వ్యవస్థను నిలిపేశారు. ఆ నగరాన్ని హైరిస్క్ ప్రాంతంగా ప్రకటించారు. దోబీ వృత్తి చేసే మహిళకు వైరస్ సోకడంతో.. చైనాలోని సోషల్ మీడియాలో ఇదే చర్చాంశమైంది. ఆమెకు ఇన్‌ఫెక్షన్ ఎలా సోకిందని ఊహాగానాలు సాగాయి. అయితే ఉత్తర కొరియా సరిహద్దులో జిలిన్ ప్రావిన్సు ఉన్నది. ఆ రాష్ట్రంలోనే షూలన్ నగరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియాలో కూడా భారీ సంఖ్యలో కరోనా పాజిటివ్ కేసులు ఉండి ఉంటాయని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.



## కోవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా కఠినమైన ఆంక్షలు ఉన్నప్పటికీ నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ , ఏప్రిల్ 2020 అమ్మకాలు 71% పెరుగుదల

హైదరాబాద్, మే 11రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని పిఎస్‌యు అయిన నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ 2020 ఏప్రిల్ నెలలో ఎరువుల అమ్మకంలో 71 శాతం వృద్ధిని నమోదు చేసింది. కోవిడ్ –19 లాక్‌డౌన్ కారణంగా ఏప్రిల్‌లో దేశంలో కఠినమైన ఆంక్షలు ఉన్నప్పటికీ కంపెనీ ఎరువుల అమ్మకాన్ని 3.62 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో 2.12 లక్షల మెట్రిక్ టన్నులఅమ్మకాలు జరిగాయి.

లాక్‌డౌన్ కారణంగా కంపెనీ చాలా లాజిస్టిక్స్ అడ్డంకులను ఎదుర్కోవలసి వచ్చింది, అయినప్పటికీ ఈ కీలకమైన కాలంలో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచడానికి ఏ అవకాశాన్ని జారవిడుచుకోకుండా 2020 ఏప్రిల్ నెలలో అమ్మకాలలో అత్యధిక వృద్ధిని సాధించినందుకు సిఎండి, ఎన్ఎఫ్ఎల్, షి మనోజ్ మిశ్రా మార్కెటింగ్ బృందం చేసిన కృషిని ప్రశంసించారు.

ఎన్ఎఫ్ఎల్ పంజాబ్ లోని నంగల్, బతిండా, హర్యానాలోని పానిపట్ లో ఉన్న ఐదు ప్లాంట్లలో, ఎం.పి.లోని విజయపూర్ వద్ద రెండు ప్లాంట్లలో యూరియాను ఉత్పత్తి చేస్తుంది. కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం 35.68 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా. ఈ అన్ని ఉత్పత్తులతో, కంపెనీ 2019–20లో అత్యధికంగా 57 లక్షల మెట్రిక్ టన్నుల అమ్మకాన్ని నమోదు చేసింది, ఇది వరుసగా ఐదవసారి. క్లిష్ట సమయాల్లో ఈ ప్లాంటులు గరిష్ఠ స్థాయిలో కార్యకలాపాలను నిర్వహించడం పెద్ద విజయం. ముఖ్యంగా దేశంలోని వ్యవసాయదారులకు దీని ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది.

కోవిడ్–19తో పోరాడటానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా ఎన్ఎఫ్ఎల్ ఉద్యోగులు ఒక రోజు జీతం పీఎం కేర్స్ ఫండ్ కి రూ.88 లక్షలు మాత్రమే కాకుండా సిఎస్ఆర్ కింద రూ.63.94 లక్షలు కలిపి మొత్తం రూ.1.52 కోట్లు విరాళాలుగా అందించారు.

## ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరిన్ తరలింపు

### సిఎం జగన్ ఆదేశాలతో నిర్ణయం: కలెక్టర్

విశాఖపట్టణం,మే11(ఆర్ఎన్ఎ): ఎల్జీ పాలిమర్స్‌లో లీకైన స్టైరిన్‌ను తరలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ తెలిపారు. స్టైరిన్‌ను తరలించే పక్రియ ప్రారంభమైందని, ఎల్జీ పాలిమర్స్‌లో పరిస్థితి అదుపులో ఉందన్నారు. లీకైన ట్యాంక్‌తో పాటు అయిదు ట్యాంకుల్లో 12 నుంచి 13వేల టన్నుల స్టైరిన్ ఉందని, వాటిని నౌకల ద్వారా కొరియాకు తరలించనున్నట్లు చెప్పారు. మూడు నుంచి అయిదు రోజుల్లో తరలింపు పక్రియ పూర్తి అవుతుందని కలెక్టర్ వెల్లడించారు. అలాగే బాధితులకు అండగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారని, ఇప్పటికే మృతుల కుటుంబాలకు కోటి పరిహారం అందించినట్లు చెప్పారు. బాధిత గ్రామాలలో ఇంటిలో ప్రతి కుటుంబ సభ్యునికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేస్తామన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలు పరిహారం మంగళవారం నుంచి అందిస్తామన్నారు. డీశానిటైజేషన్ పూర్తయ్యాక... కోలుకున్న వారితో పాటు పునరావాస కేంద్రాల్లో ఉన్నవారిని గ్రామాలకు తరలిస్తామని, బాధితులకు పూర్తి భరోసా కల్పిస్తామన్నారు. గ్రామంలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇక స్టైరిన్ గ్యాస్ ప్రభావిత గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, వైద్య బృందాలు, జీవీయంసీ పారిశుద్ధ్య బృందాలు నిర్విరామంగా పని చేస్తున్నాయన్నారు.

## ఎపిలో కొత్తగా మరో 38 పాజిటివ్ కేసులు

### కేసుల సంఖ్య 2018కి చేరిక

### 73 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జ్

విజయవాడ,మే11(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 38 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2018 కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. గడిచిన 24 గంటల్లో 7409 శాంపిల్స్‌ను పరీక్షించగా.. 38 మందికి కరోనా నిర్ధారణ అయినట్టు తెలిపింది. కొత్తగా అనంతపురం జిల్లాలో 8, చిత్తూరు జిల్లాలో 9(8 మంది తమిళనాడు నుంచి వచ్చిన వారు), గుంటూరు జిల్లాలో 5, కృష్ణా జిల్లాలో 3, విశాఖపట్నం జిల్లాలో 3, నెల్లూరు జిల్లాలో 1, కర్నూలు జిల్లాలో 9 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 73 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. దీంతో రాష్ట్రంలో మొత్తం డిశ్చార్జి అయినవారి సంఖ్య 998కి చేరింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 45 మంది కరోనాతో మరణించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 975 మంది కరోనాతో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకూ 998 మంది కరోనాను జయించి డిశ్చార్జ్ కాగా.. ఒక్కరోజే 73 మంది సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యి ఇంటికెళ్లారు. కర్నూలు–28, గుంటూరు–22, నెల్లూరు–14, కృష్ణ–05 కడప. శ్రీకాకుళంలో ఇద్దరు చొప్పున డిశ్చార్జ్ అయ్యారు. ఇదిలా ఉంటే.. గడిచిన 24 గంటల్లో ఎటువంటి మరణాలు సంభవించలేదు. ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 45గానే ఉందని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి ఉధృతి తగ్గుతున్నట్లు అనిపిస్తోంది. వారం క్రితం రోజూ 70, 80కు పైగానే కేసులు నమోదవ్వగా.. గత నాలుగైదు రోజులుగా కేసులన్నీ 30, 40కు మించి పెరగలేదు. సగం కేసులు మాత్రమే నమోదవుతున్నాయ్. దీన్ని బట్టి చూస్తే రాష్ట్రం వైరస్ ముప్పు ధాటి నుంచి కోలుకుంటోందని చెప్పుకోవచ్చు. గత 24 గంటలుగా కేవలం 38 పాజిటివ్ కేసులు మాత్రమే నమోద య్యాయి. తాజాగా నమోదైన కేసులతో కలిపితే మొత్తం కేసుల సంఖ్య 2018కు చేరుకుంది. గడిచిన 24 గంటల్లో 7,409 మందికి పరీక్షలు చేయగా 38మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని ఆరోగ్యశాఖ హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది.

## సిర్పూర్ పేపర్ మిల్లులో గ్యాస్ లీక్: ఒకరికి అస్వస్థత

కుమురంభీం,మే11(ఆర్ఎన్ఎ): కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లులో ఒక పైప్ లైన్‌లో స్వల్పంగా గ్యాస్ లీక్ అయ్యింది. దీంతో వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం.. తక్షణమే మరమ్మత్తు పనులను చేయించింది. ఈ గ్యాస్ లీకేజ్ కారణంగా ఒక కార్మికుడు స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కార్మికులు ఫిర్యాదు చేయడంతో తోణ చర్యలు తీసుకున్నారు.

# తమిళనాడులో పెరుగుతున్న కేసుల సంఖ్య

### ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటనతో ఆందోళన

చెన్నై,మే11(ఆర్ఎన్ఎ): తమిళనాడులో కరోనా వైరస్ మరింతగా విజృంభిస్తోంది. మున్ముందు మరింత మందికి సోకే ప్రమాదం ఉందా..? అంటే అవుననే అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. ఆ సంస్థ రాయబారి డేవిడ్ నబరే విడుదల చేసిన ఒక ప్రకటనలోని వివరాల్లో తమిళనాడు గురించి ప్రస్తావించడం చర్చనీయాంశ మైంది. భారత్‌లో కరోనా వైరస్ కట్టడయ్యేందుకు ముందు జూలైలో ఉచ్ఛస్థితికి చేరుకుంటుంది. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత పాజిటివ్ కేసులు భారీగా పెరిగిపోతాయని తెలుస్తోంది. కరోనా వైరస్ జూలైలో తారస్థాయికి చేరుకుంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఆ తర్వాత తగ్గుముఖం పడుతుందని వెల్లడించింది. ఈ పెనుముప్పు నుంచి బయటపడడం ఎలాగోనని స్థానికులు హడలిపోతున్నారు.

ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. పాజిటివ్ కేసులు పెరిగినా వైరస్ వ్యాప్తి స్థిరంగా ఉంటుంది. భారత్ అత్యంతవేగంగా కట్టుబాటు చర్యలను అమల్లోకి తెచ్చినందున వైరస్‌ను కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయగలిగారు. జనాభా అత్యధికంగా ఉండే భారత్‌లో వైరస్ కట్టడి చేయడం ఎంతో కష్టం. భారత్‌లో లాక్‌డౌన్ చర్య ఎంతో మంచి ఫలితాలను ఇచ్చింది. మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ, తమిళనాడులో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంది. భారత్‌లో ప్రస్తుతం వేసవి నడవడం ఎంతో మంచిది. ఎండ వేడిమి వల్ల వైరస్ వేగంగా వ్యాపించదు అని తెలిపారు. వైరస్ వ్యాప్తి విశ్వరూపాన్ని ప్రదర్శించి కోయంబేడు మార్కెట్ 2,167 మందిని బాధితులుగా మార్చింది. పొరుగు జిల్లాల నుంచి వచ్చే హోల్‌సేల్, రిటైల్ కూరగాయల వ్యాపారులు భౌతికదూరం పాటించడంలో నిర్లక్ష్యాన్ని చూపడం శాపంగా మారింది. కోయంబేడు మార్కెట్ వల్ల చెన్నైలో వెయ్యి మందికి, కడలూరులో 317, అరియలూరులో 239, విల్లుపురంలో 177, తిరువళ్లూరులో 124 ఇలా నలుచరగులా విస్తరణకు కారణమైంది. ఇప్పటి ఆదివారం వరకు మొత్తం నమోదైన కేసులు– 669 కాగా, రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసులు– 7,204కు చేరుకుంది. చెన్నైలో పాజిటివ్ కేసులు– 509 కాగా, మొత్తం కేసులు– 3,839లకు చేరుకుంది. ఇప్పటి వరకు కరోనా కారణంగా మొత్తం మరణాలు 47 మంది మరణించారు.

# మామిడి పళ్లకు మంచి మార్కెట్ మానుకోట

### రైతులకు అండగా ప్రభుత్వం ఉంది: సత్యవతి

మహబూబాబాద్,మే11(ఆర్ఎన్ఎ): మామిడి పండ్ల ఉత్పత్తిలో మహబూబాబాద్ జిల్లాను అగ్రగామిగా నిలుపాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఇక్కడ ఇపళ్ల రుచిని అందరూ తెలుసుకునేల ఆచేయాలన్నారు. అలాగే పండ్లకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు.

మహబూబాబాద్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో సహజ సిద్ధమైన తాజా మామిడి పండ్ల విక్రయ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. మామిడి పండ్ల ఉత్పత్తిలో జిల్లాకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఉద్యాన పంటలకు ఇతోధికంగా ప్రభుత్వం సాయం అందిస్తోందని అన్నారు. 25 వేల ఎకరాల్లో పామాయిల్ సాగుకు కొంతమంది రైతులు ముందుకొచ్చారని తెలిపారు.

అలాగే సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా రైతులు పంట మార్పిడి చేసి అధిక దిగుబడులు పొందాలని మంత్రి పేర్కొన్నారు. ఇదిలావుంటే రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో పాటుపడుతున్నారని సత్యవతి రాథోడ్ అన్నారు. దంతాలపల్లి మండలం బొడ్లడలో మంత్రి మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి స్థానికి ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరుగాలం కష్టించే అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దనే ఉద్దేశంతో



టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగాంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తుందన్నారు. రుణామఫీ, రైతుబంధు కింద నిధులువిడుదల చేసి సిఎం కెసిఆర్ రైతులపట్ల తన ప్రేమను చాటుకున్నారని అన్నారు.

# బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండ

### గ్రామాల శానిటైజేషన్ తరవాత ప్రజల తరలింపు

### మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం అందచేత

### ఎల్జీ పాలిమర్స్‌కు అనుమతించే ప్రసక్తి లేదు: మంత్రులు

విశాఖపట్టణం,మే11(ఆర్ఎన్ఎ): ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో మృతి చెందినవారితో పాటు, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎపి మంత్రులు కన్నబాబు తదితరులు అన్నారు. అలాగే కంపెనీని తెరిచే ప్రసక్తి లేదన్నారు. తొలిరోజే ఈ విషయంచెప్పామన్నారు. పరిహానికి సంబంధించి ఎనిమిది కుటుంబాలకు మంత్రులు కురసాల కన్నబాబు, బొత్స సత్య నారాయణ, అవంతి శ్రీనివాస్, ధర్మాన కృష్ణదాస్‌లు చెక్కులు అందించారు. మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల చెక్కులను అందజేశారు. మొత్తం ఎనిమిది కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కురసాల కన్నబాబు మాట్లడుతూ.. ఈ సంఘటన దృష్ట్యా పారిశ్రామిక భద్రతకు సంబంధించి నూతన విధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భావిస్తున్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విధంగా మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం అందించామన్నారు. ఆ మొత్తాన్ని బ్యాంకులో జమచేసి దానికి సంబంధించిన డాక్యుమెంట్స్, సీఎం జగన్ వారికి రాసిన లేఖతో పాటు అందించామని తెలిపారు. ప్రస్తుతం ఎనిమిది కుటుంబాలకు చట్టపరమైన వారసులను గుర్తించామని, మిగిలిన నాలుగు కుటుంబాల వారసులు గుర్తించిన వెంటనే పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. చెక్కల పంపిణీ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. 'బాధితులను తక్షణమే ఆదుకోవాలని, వారికి అండగా నిలవాలని భావించి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటిరూపాయల పరిహారం ఇస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఆదివారం రాత్రి విశాఖపట్నంలో మంత్రులు, అధికారులతో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సోమవారం ఉదయమే మృతుల కుటుంబాలకు సహాయం అందించాలని ఆదేశించారు. మనసున్న మనిషిగా ఆయన స్పందించిన తీరుకు ఈ సహాయం ఓ నిదర్శనంగా చెబుతున్నాం. ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న వారి గురించి సమీక్షించాం. డిశ్చార్జ్ చేయాల్సిన వారిని గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి పంపిస్తాం. రేపు ఎక్కువ మందిని డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంటుందని వైద్య అధికారులు తెలియచేశారు. ఎవరైతే పూర్తిగా కోలుకుని ఇకపై ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యాధికారులు ధృవీకరిస్తారో వారిని మాత్రమే డిశ్చార్జ్ చేస్తాం. డిశ్చార్జ్ చేసిన అనంతరం వారికి కూడా ముఖ్యమంత్రి ప్రకటించిన పరిహారాన్ని అందిస్తాం. ఐదు గ్రామాలలో బాధితులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు సహాయం అందిస్తామని సీఎం చెప్పారు. ఆ ప్రకారం గ్రామాలలోకి ప్రజలు తిరిగి వెళ్లిన వెంటనే వాలంటీర్లను ఇంటికి పంపించి పెన్షన్ మాదిరిగా ఇస్తున్నారో అదే విధంగా ఇంటివద్దకే పంపిస్తాం. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తప్పకుండా సహాయం అందించడం వైఎస్ జగన్ మార్క్. అందుకే వారందరికీ సేవలు తక్షణం అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. సంఘటన ఏడో తేదీ జరిగితే కేవలం మూడురోజుల వ్యవధిలో బాధిత కుటుంబాలకు కోటిరూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. ఫ్యాక్టరీలో ఉన్న స్టైరిన్ గ్యాస్ పూర్తి అదుపులో ఉంది. దయచేసి సోషల్ మీడియా రూమర్స్ గాని, వదంతులు గాని ఎవ్వరూ కూడా నమ్మద్దు. ఐదు గ్రామాలలో రసాయనాలతో క్లీన్ చేసే కార్యక్రమం మున్సిపల్ సిబ్బంది ద్వారా జరుగుతోంది. సోమవారం రాత్రికి ప్రజలకు ఇబ్బంది లేకుండా భోజన వసతి కూడా ఏర్పాటు చేశాం. ప్రజలందరూ కూడ గ్రామాలలోకి వచ్చిన తర్వాత మెడికల్ క్యాంపులు కూడా పెట్టమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పారు. అన్నిరకాల హెల్త్ చెకప్‌లు చేయించి వారికి పూర్తి అండగా ఉంటాం' అని అన్నారు.

ఎల్జీ పాలిమర్స్ ప్రమాద సంఘటన చాలా దురదృష్టకరం అని బాధితులు, చనిపోయిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నట్లు మంత్రి ధర్మాన కష్ణ÷–ణదాస్ అన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వం మాది. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అనేకమంది నిపుణులతో కమిటీలు వేసి నివేదికలు తెప్పించుకున్న తర్వాత తగిన విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. బాధిత ఐదు గ్రామాల ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారుల అండగా ఉంటారని పేర్కొన్నారు. నిపుణుల సూచనల మేరకే ఐదు గ్రామాలలో శానిటైజ్ చేస్తున్నట్లు మంత్రి బొత్స సత్యన్నారాయణ వెల్లడించారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత మేం కూడా గ్రామాలకు వెళ్లి గ్రామస్తులను ఇళ్లల్లోకి తీసుకువెళ్తాం. కంపెనీ మెయింటెనెన్స్కు జిల్లా కలెక్టర్ మూడుషిఫ్ట్ లలో 15 మంది చొప్పున 45 పాసులు జారీచేశారు. ప్రమాదం జరిగినప్పుడు 15 మంది ఉన్నారు. కంపెనీపైన మాకు ప్రేమలేదు. ఇక్కడ ఉన్న ప్రజలపైన, వారి సంక్షేమం, ఈ ప్రాంతం భద్రత పైన మాత్రమే మాకు ప్రేమ ఉంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దాలనే ధ్యేయంగా పెట్టుకున్నాం. ఈ ప్రభుత్వం వచ్చాక ఎల్జీ పాలిమర్స్ కు ఎటువంటి నూతన అనుమతులు ఇవ్వలేదు. పాత అనుమతలతోనే పనిచేస్తోందని స్పష్టం చేశారు.

# సీఎం చిత్రపటానికి మంత్రి అల్లోల క్షీరాభిషేకం

నిర్మల్ , మే 11: సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు.

రూ.25 వేలలోపు పంట రుణాలమాఫీతో రైతుబంధు పథకానికి నిధులు మంజూరు చేసినందుకు గానూ మంత్రి అల్లోల, ఎమ్మెల్యే రేఖా నాయక్, రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా వైరస్‌తో ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ, వానాకాలం సాగుకు రైతుబంధు కోసం రూ. 8,210 కోట్లు విడుదల చేసిన సీఎం కేసీఆర్ రైతుపక్షపాతి అని అన్నారు. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ రైతులకు ఇబ్బంది కలుగవద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతాంగ సంక్షేమానికి నిధులు విడుదల చేశారని తెలిపారు.

## సెల్ఫ్ క్వారంటైన్‌లోకి అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్

వాషింగ్టన్,మే11(ఆర్ఎన్ఎ): అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ సిబ్బందిలో ఒకరికి కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారణ కావడంతో మైక్ పెన్స్ సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే గత కొంతకాలంగా ఆయనకు నిర్వహిస్తున్న పరీక్షల్లో నెగటివ్ రిపోర్టులు వస్తున్నప్పటికీ, వైద్యుల సూచన మేరకు స్వీయ నిర్బంధానికే పెన్స్ మొగ్గు చూపారు. మరోవైపు, కరోనా వైరస్‌ను అదుపు చేసేందుకు ఏర్పడిన బృందమే ఆ వైరస్ బారినపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆ బృందంలోని ఉన్నతస్థాయి శాస్త్రవేత్తలు ఇప్పటికే స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. అలాగే, ఈ బృందంలోని సభ్యులైన అలర్జీ, అంటువ్యాధుల నివారణ జాతీయ డైరెక్టర్ ఆంథోనీ ఫౌచీ, వ్యాధి నియంత్రణ నివారణ కేంద్రాల డైరెక్టర్ రెడ్‌ఫీల్డ్, ఆహార, ఔషధ పరిపాలన విభాగం కమిషనర్ స్టీఫెన్ హాన్‌లు కూడా నిర్బంధంలోనే ఉన్నారు.

## ఇటుకబట్టీల్లో మొదలైన పనులు

లక్నో,మే11(ఆర్ఎన్ఎ): ఒకవైపు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతుండగానే మరోవైపు కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభమవుతున్నాయి. లాక్‌డౌన్ సడలింపుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్మాణ రంగానికి సంబంధించిన పనులు, వ్యాపారాలకు అనుమతి ఇచ్చింది. దీంతో అన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ

మార్గదర్శకాలను అమలు చేస్తున్నాయి. అయితే కరోనా కేసులు ఎక్కువగా ఉన్న చాలా ప్రాంతాల్లో మాత్రం సంబంధిత పనులు, వ్యాపారాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ కు చెందిన పాలనా యంత్రాంగం ఇటుక బట్టీల్లో పనులకు అనుమతి ఇచ్చింది. దీంతో పాక్ బాడా పోలీస్ స్టేషన్ పరిధిలోని 100 ఇటుక బట్టీల్లో పనులు ప్రారంభమయ్యాయి.

## నిలకడగా మన్మోహన్ సింగ్ ఆరోగ్యం: ఎయిమ్స్

న్యూఢిల్లీ,మే11(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆరోగ్యం నిలకడగానే ఉందని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎయిమ్స్ వర్గాలు వెల్లడించాయి. అయితే స్వల్పంగా జ్వరం ఉన్నదని, ఛాతీనొప్పి తగ్గడానికి ఇచ్చిన ఔషధాలవల్ల జ్వరం వచ్చి ఉంటుందని డాక్టర్లు తెలిపారు. ఛాతీలో నొప్పి రావడంతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆదివారం సాయంత్రం ఎయిమ్స్ హాస్పిటల్ లో చేరిన విషయం తెలిసిందే. అయితే జ్వరానికి ఇతర కారణాలేమైనా ఉన్నాయో తెలుసుకునేందుకు అన్ని రకాల వైద్య పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిసింది. మన్మోహన్‌సింగ్ కు 2009లో బైపాస్ సర్జరీ జరిగింది. 2004 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా పనిచేసిన మన్మోహన్.. ప్రస్తుతం రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## కల్తీకల్లు తయారుచేస్తున్న వ్యక్తి అరెస్ట్

రంగారెడ్డి,మే11(ఆర్ఎన్ఎ): జిల్లాలో కల్తీ కల్లు తయారు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలం గూడూరులో కల్తీకల్లు స్థావరంపై శంషాబాద్ డివిజన్ ఎస్‌వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు దాడులు నిర్వహించారు. కల్లు తయారు చేస్తున్న రాజు అనే వ్యక్తి పట్టుబడగా, శేఖర్, అశోక్ అనే మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 150 లీటర్ల కల్తీకల్లు, ఐదు గ్రాముల క్లోరోఫామ్‌ను, కల్లు తయారీ సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## వెన్నాడుతున్న విషవాయువు దుష్ఫలితాలు

### పశువులకు మేత దొరక్క రైతులు ఆందోళన

### ఇప్పుడే మామూలు పరిస్థితి రాదంటున్న పర్యావరణవేత్తలు

విశాఖపట్నం,మే11(ఆర్ఎన్ఎ): విషవాయువు మిగిల్చిన భయానక జ్ఞాపకాల నుంచి విశాఖలోని ఐదు గ్రామాలు క్రమంగా తేరుకుంటున్నాయి. అయితే పశుపక్ష్యాదులు, చెట్లు మాత్రం ఇప్పుడే కోలుకునేలా కనిపించడం లేదు. దీనికితోడు పశువుకలకు మేత దొరక్క అల్లాడుతున్నాయి. మరోవైపు ఇక్కడ పరిస్థితులు మామూలుకు ఇప్పుడే చేరుకోవడం అసాధ్యమని పర్యావరణవేత్తలు అన్నారు. అక్కడ ఎంతమేరకు విషవాయువు ప్రభావం ఉందో అధ్యయనం తరవాతే తెలుస్తుందని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అన్నారు. పశువులల్లో ఇప్పుడే ప్రభావం తగ్గదన్నారు. ఎల్జీ పాలిమర్స్‌కు అతి సమీపంలోని వెంకటాపురానికి చెందిన ఇల్లపు తాతారావు పాడిరైతు. కొద్దిపాటి పొలం మీద వచ్చే ఆదాయంతో జీవిస్తున్నాడు. గ్యాస్ లీకేజీ ప్రమాదంలో తాతారావుకు చెందిన ఒక గేదె, మూడు పెయ్యలు, ఒక ఆవు, లేగదూడ అక్కడిక్కడే మృత్యువాత పడ్డాయి. ఒక గేదె చూపు కోల్పోయింది. మూడు రోజులు వేరే చోట తలదాచుకున్న ఆయన ఆదివారం సాయంత్రం పశువులశాలకు చేరుకుని గేదెకు సపర్యలు చేస్తూ కనిపించారు. అంతా సర్దుకున్నాక ఇంటికి వస్తానని తాతారావు చెప్పారు. కంపెనీకి కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ గ్రామంలో 600 పైచిలుకు ఇళ్లు, 2,250 మంది జనాభా ఉన్నారు. నీరి నేషనల్ ఎన్విరాన్మెంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిపుణుల బృందం ఇక్కడ నీరు, మట్టి పరీక్షలు నిర్వహిస్తోంది. గ్రామం నుంచి కొన్ని నమూనాలను సేకరించారు. గాలి కాలుష్యాన్ని పరిశీలించగా 0.1గా నమోదైనట్లు చూపించింది. ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు శ్రమించడంతో మూడు రోజుల్లోనే కాలుష్య మేఘాలు తొలగిపోయాయి. రసాయ

నాలతో కూడిన వాయువులు ఆవిరవుతున్నాయి. గ్రామస్తుల్లో భయాలను తొలగించేందుకు జాతీయ పర్యావరణ పరిశోధన సంస్థ (నీరి) నుంచి ఐదుగురితో కూడిన నిపుణుల బృందాన్ని ప్రభుత్వం రంగంలోకి దించింది. గ్రామాల్లో గాలి, నీరు, నేలపై స్టైరీన్ అవశేషాల కోసం పరీక్షలు నిర్వహిస్తోంది. విషపూరిత వాయువులు లేవని నిపుణులు నిర్ధారించిన తరువాతే గ్రామస్తులను సురక్షితంగా ఇళ్లకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిపుణుల బృందం మరో 24 గంటల్లో నివేదిక ఇవ్వనుంది. ప్రాథమిక అంచనా ప్రకారం అక్కడ వాతావరణం దాదాపుగా సాధారణ పరిస్థితికి వచ్చినట్లు తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎల్‌జీ పాలిమర్స్‌కు సమీపంలోని ఐదు గ్రామాలైన వెంకటాపురం, నందమూరి నగర్, పద్మనాభనగర్, ఎస్సీబీసీ కాలనీ, కంపరపాలెంలలో బాధిత గ్రామాల్లో కనిపించిన మూగజీవాల కళేబరాలను తొలగించడంతో పాటు పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో చేపట్టారు. ప్రతి గ్రామంలో గాలి కాలుష్యాన్ని సైతం పరిశీలిస్తున్నారు. గాలిలో స్టైరీన్ గ్యాస్ దాదాపుగా తొలగిపోయినట్లు అధికారులు గుర్తించారు. దుర్ఘటన అనంతరం గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పలు ఇళ్లకు తాళాలు వేయలేదు. దీంతో పోలీసులు నిరంతరం నిఘా పెట్టారు. కొన్ని ఇళ్లకు పోలీసులే తాళాలు కొనుగోలు చేసి వేశారు. ఎల్జీ పాలిమర్స్ కంపెనీకి ఆనుకుని సుమారుగా 200 మీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి చెందిన వారే ఎక్కువగా విష వాయువుతో ప్రభావితమయ్యారు. గ్రామంలో సుమారు 1,250 ఇళ్లు, 5 వేల జనాభా ఉంది. ఇప్పుడిప్పుడే ఒక్కొక్కరుగా గ్రామానికి చేరుకుని ఇళ్లను చూసి శుభ్రం చేసుకుని తిరిగి వెళుతు న్నారు. జీవీఎంసీ సిబ్బంది ప్రతి అరగంటకు ఒకసారి ఇక్కడ సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని చల్లుతున్నారు. పోలీసులు నిత్యం ఇక్కడ పహారా కాస్తున్నారు. గ్రామానికి తిరిగి వస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు పంపిస్తున్నారు. ఎల్జీ పాలిమర్స్‌లో గతంలో ప్రమాదాలు జరిగినా పెద్దగా నష్టం జరిగేది కాదు. ఇప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే లక్షలాది మంది ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడింది. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని కంపెనీని తరలించాలన్న డిమాండ్ పెరుగుతోంది.



పాలాభిషేకం చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

